రుణమాఫీ తీరుపై నిరసనాస్త్రం

బ్యాంకుల ఎదుట రైతుల ఆందోళన.. లక్షలోపు రుణాలు పూర్తిగా మాఫీ కాలేదని ఆవేదన

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం గానుగపాడు సొసైటీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

నిర్మల్ అర్బన్, జూలై 22: తొలి విడతలో రూ.లక్ష లోపు రుణం మాఫీ కాని రైతులు పోరు బాట పడుతున్నారు. సోమవారం నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎదుట రైతులు నిరసన వ్యక్తంచేశారు. లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు మాత్రమే మాఫీ అయ్యాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. లక్షలోపు తీసుకున్న రుణాలను మాఫీ చేయకుండా ఎందుకు ఆపారో తెలపాలంటూ బ్యాంకు ఎదుట నిరసన చేపట్టారు. దీంతో బ్యాంకు అధికారులు బయటకొచ్చి రైతులతో మాట్లాడారు. హెడ్ ఆఫీస్ నుంచి వచ్చిన మార్గదర్శకాల ప్రకారమే చేశామని తెలిపారు. ఏదైనా సాంకేతిక సమస్యలతో పొరపాటు జరిగి ఉండొచ్చని, పైఅధికారులతో చర్చించి మూడు రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రైతులు శాంతించారు.

రంగారెడ్డి డీసీసీబీలో 22 వేల మందికి మొండిచెయ్యి

తొలి విడతలో 11,700 మందికే మాఫీ

రంగారెడ్డి, జూలై 22 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా డీసీసీబీ పరిధిలో రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు సుమారు 34 వేల వరకు ఉన్నారు. అయితే, ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో 11,700 మంది రైతుల పేర్లు మాత్రమే ఉన్నాయి. మిగిలిన 22 వేల మంది రైతులకు మొండిచెయ్యి చూపినట్టేనా? అన్న భావన రైతుల్లో కలుగుతున్నది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులందరికీ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని, భార్యాభర్తలిద్దరినే కుటుంబసభ్యులుగా పరిగణించాలని, వేరుగా ఉంటున్న కుమారులకు కూడా రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు. కొద్ది మందికే మాఫీ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

లోకం పోకడ

ధోకా లేదు.. నిశ్చింతగా వుండు!

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

రుణమాఫీ రాని రైతుల పక్షాన కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివేకానంద ఫిర్యాదు

మేడ్చల్, జూలై 22(నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీ పథకాన్ని ఎటువంటి షరతులు లేకుండా అమలుచేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద డిమాండ్ చేశారు. రుణమాఫీ రాని రైతుల పక్షాన ఎమ్మెల్యే కేపీ వివేకానంద, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో వివేకానంద మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేటా ముంచుతున్నదని విమర్శించారు. రుణమాఫీ కాని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కదోవ పట్టించిందని, ఆ నిధులను రుణమాఫీకి వినియోగించిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మే, జూన్ నెలల్లోనే రైతుబంధును అందించి వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించిందని చెప్పారు. రైతుబంధు కింది మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు కేసీఆర్ ప్రభుత్వం రూ.39 కోట్లు అందిస్తే, సీఎం రేవంత్‌రెడ్డి అది ఇవ్వకుండా, రుణమాఫీ పేరుతో రూ.11 కోట్లు మాత్రమే ఇచ్చారని వివరించారు. రుణమాఫీ అంశంపై అసెంబ్లీలో ఎండగడతామని చెప్పారు.

మాఫీపై ఫిర్యాదుల వెల్లువ

మొదటిపేజీ తరువాయి...

అధికారుల నుంచి సరైన సమాచారం లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. డీసీసీబీల్లో రుణమాఫీ సమస్య మరింత ఎక్కువగా ఉన్నదని రైతులు చెప్తున్నారు. రూ.లక్ష వరకు రుణమాఫీ కావాల్సిన వారిలో సగం మందికి కూడా మాఫీ కావడం లేదని, భారీ సంఖ్యలో రైతుల పేర్లు గల్లంతవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రుణమాఫీలో చిత్రవిచిత్రాలు

రుణమాఫీలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. తొలి జాబితాలో రుణం మాఫీ అయిన రైతులకు కూడా మొత్తం రుణం నిధులు ఖాతాలో జమ కావడం లేదు. ఉదాహరణకు ఒక రైతుకు అసలు, వడ్డీతో కలిసి రూ.70 వేల రుణం ఉంటే.. మొత్తం రూ.70 వేలు మాఫీ కింద రైతు ఖాతాలో జమ కావాలి. కానీ విచిత్రంగా ఆ రైతు ఖాతాల్లో రూ. 20 వేలే జమవుతున్నాయి. చాలా బ్యాంకుల్లో ఇలాంటి సమస్య ఉత్పన్నమవుతున్నది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖల్లో ఈ సమస్య తీవ్రంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఈ బ్యాంకుల్లో చాలామంది రైతులకు మాఫీ మొత్తంతో పోల్చితే తక్కువ నిధులు ఖాతాలో జమవుతున్నాయి. అయితే దీనికి కారణం అధికారులు కూడా చెప్పకపోవడం గమనార్హం. ఇలాంటివి బ్యాంకుల తప్పిదాల వల్లే జరిగాయని, నిధులు జమ చేయడంలో ఎలాంటి పొరపాటు లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు.

- నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామంలో గల బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రూ.లక్ష వరకు రుణం మాఫీ కావాల్సి ఉన్న రైతుల ఖాతాల్లో రూ.30 వేలు, రూ.40 వేలు, రూ.60 వేలు మాత్రమే జమ య్యాయి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం గానుగపాడు సొసైటీలో రూ.లక్ష వరకు రుణమాఫీ కావాల్సిన రైతులు 2,500 మంది ఉంటే 500 మందికి మాత్రమే మాఫీ అయింది. గుంపెన సొసైటీలో 1,800 మంది రైతులకుగాను 300 మందికి మాత్రమే రుణ మాఫీ అయింది.
- జనగామలో తిరుపతి అనే రైతుకు వడ్డీతో కలిపి రూ.86 వేల రుణం ఉంటే ఆ రైతు ఖాతాలో రూ.13,497 మాత్రమే జమ య్యాయి.
- రంగారెడ్డి జిల్లా డీసీసీబీ పరిధిలో రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు సుమారు 34 వేల వరకు ఉన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో 11,700 మంది పేర్లు మాత్రమే వచ్చాయి. మిగిలిన 22 వేల మంది రైతుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.

70 వేలకు 13 వేలే మాఫీ

ఎస్‌బీఐ జనగామ బ్రాంచ్‌లో రూ.70 వేలపైగా రుణం తీసుకున్న. వడ్డీతో కలిపి రూ. 86 వేలు కావచ్చు. రూ.లక్ష లోపు రుణమాఫీకి అర్హుడినైనా నాకు రూ.13,497 మాఫీ అయినట్టు నెల 18న మెసేజ్ వచ్చింది. పూర్తిగా రుణమాఫీ కాలేదు. వ్యవసాయ అధికారికి చెప్తే బ్యాంకుకు వెళ్లి తెలుసుకో అన్నడు. గతంలో నేను తీసుకున్న రుణం పూర్తిగా మాఫీ అయ్యింది. ఇప్పుడేమో ఇట్లయ్యింది.

-దడిగ తిరుపతి, రైతు, గానుగుపహాడ్

కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలి

గానుగపాడు సొసైటీ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి బీఆర్ఎస్ నిరసన

చండ్రుగొండ, జూలై 22: కొర్రీలు, షరతులు పెట్టకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం గానుగపాడు సొసైటీ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు సోమవారం నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. గానుగపాడు సొసైటీలో 2,500 మంది రైతులు ఉంటే.. 500 మందికి, గుంపెన సొసైటీలో 1,800 మందికి గాను 300 మంది రైతులకు మాత్రమే రుణం మాఫీ చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులందరికీ రుణమాఫీ చేయకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సొసైటీ చైర్మన్ చెవుల చందర్‌రావు, సీఈవో లంక నర్సింహారావుకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు భూపతి రమేశ్, కన్నయ్య, తుపాకుల రాజు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	30.0°c	25.0°c
వరంగల్	29.5°c	22.5°c
హైదరాబాద్	29.5°c	23.1°c
ఆదిలాబాద్	29.2°c	23.5°c
నల్లగొండ	29.0°c	22.0°c
కరీంనగర్	29.0°c	25.0°c
నిజామాబాద్	27.1°c	23.0°c
రంగారెడ్డి	26.6°c	22.1°c
మహబూబ్‌నగర్	26.5°c	23.2°c
మెదక్	26.0°c	22.3°c

33 వేల మందికి రుణమాఫీ కాలేదు

- సాంకేతిక కారణాలతో ఇబ్బందులు
- త్వరలో రెండో విడత: మంత్రి తుమ్మల

హైదరాబాద్, జులై 22(నమస్తే తెలంగాణ): తొలి విడత జాబితాలో 33,658 మంది రైతులకు రుణమాఫీ కాలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖాతాల్లో ఇబ్బందులు, సాంకేతిక కారణాలతో జమ కాలేదని చెప్పారు. ఆ నిధులు వెనక్కి రాగానే తిరిగి చెల్లిస్తామని పేర్కొన్నారు. రెండో విడత రుణమాఫీని సాధ్యమైనంత త్వరగా అమలుచేస్తామని చెప్పారు. తొలి విడతలో 11.50 లక్షల కుటుంబాలకు రూ.6,098.94 కోట్లు విడుదలచేసినట్టు తెలిపారు. ఆర్‌బీఐ నుంచి అందిన వివరాల ప్రకారం 11.32 లక్షల కుటుంబాల ఖాతాల్లో రూ.6,014 కోట్లు జమైనట్టు తెలిపారు. కొన్ని కారణాలతో పలు కమర్షియల్ బ్యాంకుల్లోని 17,877 మంది రైతుల ఖాతాల్లో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సంబంధించి 15,781 మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ కాలేదని వివరించారు. ప్యాక్స్ సంబంధించి 15,781 రుణఖాతాల తనిఖీ పూర్తయిన వెంటనే నిధులు విడుదలచేస్తామని తెలిపారు. సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రమావత్ రాంచందర్, వైస్ చైర్‌పర్సన్‌గా బుస్సన్నగారి అశోక్ రెడ్డిని, భూపాలపల్లి చైర్‌పర్సన్‌గా గుటోజు కిష్టయ్య, వైస్ చైర్‌పర్సన్‌గా రేపాక రాజేందర్‌ని, చిట్యాల చైర్‌పర్సన్‌గా గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్‌పర్సన్‌గా ఎండీ రఫీని నియమించినట్టు మంత్రి తెలిపారు.

మరో మూడు రోజుల పాటు వర్షాలు

జిల్లాల్లో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండండి: సీఎస్

హైదరాబాద్, జూలై 22(నమస్తే తెలంగాణ): మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాల్లో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. వరదలు, వర్షాల ప్రభావంపై సోమవారం డీజీపీ జితేందర్, ప్రణాళికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌సుల్తానియాతో కలిసి ఆమె కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో వారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలపై సీఎం నిరంతరం సమీక్షిస్తున్నారని, జిల్లాల్లో ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని, పోలీస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, అగ్నిమాపక శాఖ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ తదితర శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. అన్ని జిల్లాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ, వర్షాల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాల్లో వర్ష, వరదల తీవ్రత దృష్ట్యా పూర్తి అప్రమత్తంగా ఉన్నామని, తగు చర్యలు తీసుకుంటున్నామని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల కలెక్టర్లు తెలిపారు.

ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

నిజామాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. సోమవారం భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీచేశారు.

పాలకమండలిని ఏర్పాటు చేయండి

- సీఎంకు శ్రీవైష్ణవ సేవా సమితి విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 22(నమస్తే తెలంగాణ): తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు కొత్త పాలకమండలిని ఏర్పాటు చేయాలని, బ్రాహ్మణుల సంక్షేమానికి రూ. 100 కోట్ల నిధులు విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ బ్రాహ్మణ శ్రీవైష్ణవ సేవా సమితి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సేవా సమితి అధ్యక్షుడు కొండూరి నరేందర్‌ఆచార్య, అఖిల భారత బ్రాహ్మణ, అర్చక సేవా సమాఖ్య అధ్యక్షుడు రాహుల్ దేశ్‌పాండే సోమవారం సచివాలయంలో సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వివేకానంద విదేశీ విద్యా పథకం లబ్ధిదారులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఆలయాల్లో అర్చక, వేద పండితుల పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

కవిత బెయిల్ పిటిషన్‌పై ఆగస్టు 5న విచారణ

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ కేసులో సీబీఐ దాఖలు చేసిన అదనపు చార్జిషీట్ సరిగా లేదని బెయిల్ కోసం కవిత దాఖలు చేసుకున్న పిటిషన్‌పై విచారణను ఆగస్టు 5కు వాయిదా వేస్తున్నట్టు రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరీ భవేజా సోమవారం ప్రకటించారు. సీబీఐ అదనపు చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్టు వెల్లడిస్తూ.. దీనిపై ఈ నెల 26న విచారణ చేపడతామని పేర్కొన్నారు. ఆ రోజు కవితను వర్చువల్‌గా హాజరుపర్చాలని అధికారులను ఆదేశించారు. పదిరోజులుగా ఆరోగ్యం బాగాలేని కవిత మంగళవారం మరింత అస్వస్థతకు గురికావడంతో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రైవేట్‌కు తీసుకెళ్లాలన్న న్యాయవాది విజ్ఞప్తి మేరకు శుక్రవారం ఎయిమ్స్‌లో వైద్యపరీక్షలు నిర్వహించారు.

24న లాసెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): న్యాయ విద్యా కాలేజీల్లో (మూడు/ ఐదేండ్ల) 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాలను ఆగస్టు 5 నుంచి ప్రారంభించాలని అడ్మిషన్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. 24న లాసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్, ఆగస్టు 5 నుంచి 20 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఆన్‌లైన్ పేమెంట్‌తో పాటు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ స్కానింగ్ నిర్వహిస్తారు. 21న అర్హుల జాబితా ప్రకటిస్తారు. వివరాలకు http://lawcetadm.tsche.ac.inలో సంప్రదించాలి

గతి తప్పిన పాలన

మొదటిపేజీ తరువాయి...

తెలిపారు. 'పీఎం కిసాన్ యోజనలో 18 ఏండ్లు దాటిన వారిని యాజమానితో సంబంధం లేకుండా లబ్ధిదారుడిగా పరిగణిస్తారు. కానీ రుణమాఫీలో ఆలా చేయటం లేదు. ప్రభుత్వం రైతును గుర్తించాలి తప్ప కుటుంబంతో పనేమిటి? రుణమాఫీపై రైతులు అయోమయానికి గురవుతున్నారు. పనులు వదులుకొని అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. రేషన్‌కార్డు నిబంధన లేదని ఉత్తగా చెబితే కాదు.. కొత్త ఉత్తర్వులు ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.



రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా ఐఏఎస్, ఐపీఎస్‌లకు పోస్టింగులపై బీహారీ బ్యాచ్ అని మాట్లాడారు. మరిప్పుడు ఆయన చేస్తున్నదేమిటి? అర్హత గల తెలంగాణ బిడ్డలు శివధర్‌రెడ్డి, నాగిరెడ్డి, కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, సీపీ ఆనంద్‌కు డీజీపీగా నియమించే అర్హత ఉన్నా పంజాబ్, బీహార్ బ్యాచ్ అయిన జితేందర్‌ను ఎందుకు నియమించారు?

ఆదిలాబాద్‌లోని తాంసీ మండలంలో విమల అనే మహిళకు రూ.59 వేల అప్పు ఉంటే రూ.3,434 రుణం మాఫీ అయినట్టు మెసేజ్ వచ్చింది. ఇదేం లెక్క? ఇలాంటి తప్పులు చాలా ఉన్నాయి.

- మాజీమంత్రి హరీశ్‌రావు

స్థానిక సంస్థలకు రాష్ట్రం వాటా ఏది?

స్థానిక సంస్థలకు కేంద్రం నిధులు విడుదల చేసినా, రాష్ట్రం మాత్రం నిధులివ్వటం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. పంచాయతీలో పారిశుద్ధ్యం గురించి తాను లేవనెత్తాకే కార్మికులకు జీతాలు అందాయని.. జీతాలిచ్చినా, పంచాయతీలకు నిధులు ఇవ్వలేదని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో ప్రతి నెల పంచాయతీలకు రూ.275 కోట్లు తంచనుగా విడుదల చేసేవాళ్లమని, మార్చి కన్నా ముందే కేంద్రం రూ.500 కోట్లు విడుదల చేసినా, వాటిని రాష్ట్రం విడుదల చేయటం లేదని విమర్శించారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు పెట్టకపోవటం వల్ల మరో రూ.750 కోట్లు కేంద్రం విడుదల చేయలేదని వివరించారు. అమ్మ పెట్టదు అడుక్కు తిననివ్వదు అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నారు. ఉపాధి హామీ కింద రూ.2,500 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధి హామీకి కేంద్రం రూ.800 కోట్లు విడుదల చేసినా రాష్ట్రం తన వాటాగా రూ.350 కోట్లు ఇవ్వటం లేదని వెల్లడించారు. కేంద్ర నిధులు 15 రోజుల్లో ఖర్చు చేయకపోతే వడ్డీ వసూలు చేస్తారని తెలిపారు. బిల్లులు రాక చిన్న కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 8 వేల మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు రెండు నెలలుగా జీతాలు రావటం లేదని వివరించారు. రెండు నెలల నుంచి ఆసరా పింఛన్లు ఇవ్వటం లేదని, తాను నిలదీశాకే ఒక నెల పింఛను ఇచ్చారని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి జీతాలు కూడా తాము ప్రభుత్వం దృష్టికి తెచ్చాకే చలనం వచ్చిందని చెప్పారు. మన ఊరు మన బడి బిల్లులు ఇవ్వకపోవటంతో బాత్ రూములు కూడా తెరవని పరిస్థితి ఉన్నదని వెల్లడించారు. కార్యదర్శులు సొంత డబ్బులు ఖర్చు చేశారని, ఇప్పుడు వారిని బదిలీ చేశారని, ఆ డబ్బులు ఎవరివ్వాలని ప్రశ్నించారు.

సంక్షోభంలో విద్యుత్తు రంగం

పరిపాలన వైఫల్యంతో విద్యుత్తు శాఖను తీవ్ర సంక్షోభంలోకి నెడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. కరెంటు కోతలకు విచిత్ర కారణాలు చెప్తున్నారని ఎద్దేవా చేశారు. తొండలు, బల్లుల వల్లే కాదూ.. హరీశ్‌రావు చెప్తే కరెంటు తీసేస్తున్నారని అసంబద్ధ కారణాలు చెప్తున్నారని విమర్శించారు. గతానికి, ఇప్పటికి విద్యుత్తు వినియోగంలో తేడా లేకపోయినా విద్యుత్తు అంతరాయాలు, కోతలు ఉంటున్నాయని వెల్లడించారు. 'రైతులు డీడీలు కట్టినా ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వటం లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటంతో పంచాయతీలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు కరెంటు బిల్లులు కట్టడం లేదు. గృహలక్ష్మి పథకం నిధులను ప్రభుత్వం ట్రాన్స్‌కోకు విడుదల చేయకపోవటంతో సంస్థ సంక్షోభంలో కూరుకుపోయింది. 91 లక్షల మందికి తెల్లరేషన్ కార్డులు ఉంటే కనీస సంఖ్యలో కూడా పథకం అమలు కావటం లేదు. పోలీసులకు పెట్రోల్, డీజిల్ డబ్బులు కూడా ఇవ్వటం లేదు. హోం గార్డులకు జీతాలు సరిగా రావడం లేదు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు తులం బంగారం ఇవ్వటం లేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయి. సిద్దిపేటలోనే 3 వేలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. రైతుబీమా చెక్కులు నెల దాటినా రావడం లేదు. కేసీఆర్ హయాంలో వారంలో రూ.5 లక్షల బీమా చెక్కు వచ్చేది. సంక్షేమ హాస్టళ్లలో పనిచేసే వారికి 8 నెలలుగా వేతనాలు రావటం లేదు' అని వివరించారు.

ప్రతి వర్గం రోడ్డెక్కింది

కాంగ్రెస్ పాలనలో కంచెలు తీసేస్తామని చెప్పి, కొత్త కంచెలు తెచ్చారని హరీశ్‌రావు విమర్శించారు. 'అసెంబ్లీ చుట్టూ కంచెలు పెంచారు. నాలుగు అంచెల కంచెలు తీసుకొచ్చారు. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు అత్యవసర పనుల కోసం గతంలో నెలకు రూ.40 లక్షలు ఇచ్చేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అవి 7 నెలలుగా బంద్ అయ్యాయి. నగరంలో చాలా డివిజన్లు చెత్తకుప్పలతో దర్శనమిస్తున్నాయి. జీహెచ్ఎంసీ ఫిర్యాదుల విభాగం పనితీరు అస్తవ్యస్థంగా మారింది. గ్రీవెన్స్‌సెల్‌లో 130 శాతం దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. చాలా మంది సిబ్బందికి 1న జీతాలు రావడం లేదు. ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. దవాఖానల్లో డాక్టర్ల బదిలీలు అస్తవ్యస్థంగా మారాయి. బదిలీల్లో పారదర్శకత లేదు. కనీస సౌకర్యాలు లేని దవాఖానలకు సూపర్ స్పెషాలిటీ డాక్టర్లను నియమించారు. వారిని అక్కడ నియమించటం వల్ల రోగులకే నష్టం, ఇబ్బంది తప్ప, డాక్టర్లకు ఎలాంటి నష్టం ఉండదు. సీనియర్లు, సూపర్ స్పెషాలిటీ డాక్టర్ల సేవలను సరైన విధంగా ఉపయోగించి రోగులకు సేవలు అందించాలి. రాష్ట్రంలో ప్రతి వర్గం రోడ్డెక్కేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉన్నది. రోడ్డెక్కని వర్గమే లేదు. 2 వేల పడకల దవాఖానలకు సూపరింటెండెంట్‌గా పనిచేసిన వారిని వంద పడకల దవాఖానలకు పంపారు' అని మండిపడ్డారు.

నాడు బీహారీ బ్యాచ్ అని..

'ఐఏఎస్, ఐపీఎస్‌లకు పోస్టింగ్‌ల విషయంలో రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా బీహార్ బ్యాచ్ అని మాట్లాడారు. ఆనాడు మాట్లాడింది ఏమిటి? ఇప్పుడు రేవంత్ చేస్తున్నదేమిటి?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. తాను బీహార్, పంజాబ్, ఇతర రాష్ట్రాల అధికారులకు వ్యతిరేకం కాదని, రేవంత్ అన్న మాటలనే గుర్తుచేస్తున్నానని స్పష్టం చేశారు. ఈ అధికారుల గురించి రేవంత్ నాడు ఏమన్నారో అన్నీ బయటపెడతానని ప్రకటించారు. బీహారీలంటే దోపిడీదారులని నాడు రేవంత్‌రెడ్డి అన్నారని, అప్పుడు వద్దన్నవారు.. ఇప్పుడు ముద్దు ఎలా అయ్యారని నిలదీశారు. ఆనాడు తెలంగాణకు చెందిన మహేందర్‌రెడ్డిని డీజీపీగా నియమిస్తే, ఆయనపై రేవంత్‌రెడ్డి ఎన్నో ఆరోపణలు చేశారని, ఇప్పుడు ఆయనను టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించారని గుర్తుచేశారు. సందీప్‌కుమార్ సుల్తానియాపై ఆరోపణలు చేసి ఇప్పుడు ఆయనకు అత్యంత కీల శాఖలు అప్పగించారని తెలిపారు. సర్వీసెస్‌లో దివ్యాంగులు పనికిరారని స్మితాసబర్వాల్ చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవించనని అభిప్రాయపడ్డారు. సిద్దిపేటలో అమలు చేసిన కొన్ని వినూత్న కార్యక్రమాలకు కేంద్ర ఆర్థిక సర్వేలో చోటు లభించడం సంతోషం అని అన్నారు. స్టీల్ బ్యాంకు కాన్సెప్ట్‌ను ఆర్థిక సర్వేలో ప్రత్యేకంగా ప్రస్తావించారని పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీ ప్యాకేజీల ధరల పెంపు

మొదటిపేజీ తరువాయి...

సంవత్సరం 54 శాతం పెరిగినట్టు వివరించారు. ప్రభుత్వంపై అదనంగా రూ.600 కోట్ల వరకు భారం పడుతున్నట్టు వివరించారు.

కొత్తగా 163 కొత్త వ్యాధులు

ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రస్తుతం ఉన్న వ్యాధులకు అదనంగా మరో 163 కొత్త ప్రొసీజర్లను చేర్చారు. ఈ మేరకు మరో ఉత్తర్వు విడుదల చేశారు. వీటితో కలిపి మొత్తం ప్రొసీజర్ల సంఖ్య 1,835కి పెరిగినట్టు మంత్రి తెలిపారు. లబ్ధిదారులకు గణనీయమైన ఆరోగ్య ప్రయోజనాలను అందజేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. కొత్త ప్రొసీజర్స్‌తో లక్షన్నర కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద 79 లక్షల కుటుంబాలకు చికిత్స అందుతున్నట్టు పేర్కొన్నారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్, ప్రైవేట్ దవాఖానల్లోని మెడికల్, సర్జికల్ విభాగాలకు చెందిన నిపుణులను సంప్రదించిన తర్వాత ధరలు పెంచినట్టు వెల్లడించారు.